క్లుప్తంగా

సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యం



డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

ఓడీచెరువు : సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యమివ్వాలని ఓడీచెరువు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లను ఆదేశించారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ కూడలి సమీపంలోని ఆవరణలో బుధవారం ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమంలో భాగంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, మద్యం తాగి నడపరాదని సూచించారు. ఫస్ట్ ఎయిడ్ కిట్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని కోరారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల డ్రైవర్లు, క్లీనర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సరైన శిక్షణతో రోడ్డు ప్రమాదాలకు చెక్

బత్తలపల్లి: సరైన డ్రైవింగ్ శిక్షణతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని ఎస్ఐ సోమశేఖర్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా 'రోడ్డు ప్రమాదాలు – వాటి నివారణకు' అనే అంశంపై వివిధ పాఠశాలల బస్సు డ్రైవర్లు, కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ దేశ పౌరుల ప్రాణాలు మీ చేతిలో ఉన్నాయని, బస్సులను జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. అతి వేగం ప్రమాదకరమన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

కందిలో పంటకోత ప్రయోగాలు



ప్రయోగాలు నిర్వహిస్తున్న అధికారులు

బత్తలపల్లి: మండలంలోని ఈదుల ముష్టూరు, అప్పరాచెరువు గ్రామాల్లో బుధవారం ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో వీఏఏ నిఖితకుమారి, ఎంపీఈఓ సోమశేఖర్, ఆదిలక్ష్మీ కందిలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీమా కోఆర్డినేటర్లు వెంకటేశులు, వీఆర్ఏ నారాయణస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీలో ఖాళీలు భర్తీ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కదిరి టౌన్: జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)లో ఖాళీగా ఉన్న 2,700 అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని ఎల్ఐసీ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎల్ఐసీ బ్రాంచ్ అధ్యక్షుడు అవధానం షమీవుల్లా ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎల్ఐసీ కార్యాలయాల్లో దాదాపు 5,400 మంది సిబ్బంది తగ్గారని, రాబోయే రెండేళ్లల్లో భారీగానే సిబ్బంది ఉద్యోగ విరమణ చేయనున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 3, 4 క్యాడర్లలో తక్షణమే పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గంగాధర్, కృష్ణారావు, నవీన్, రామకృష్ణ, రమణ, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నల్లచెరువు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎంపీడీఓ రఘునాథ గుప్తా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సమతా ఎన్జీఓ మండల కో ఆర్డినేటర్ మౌనిక ఆధ్వర్యంలో బుధవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథగుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్బాయికి 21 ఏళ్లు, అమ్మాయికి 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ గంగరత్నమ్మ, సూపర్‌వైజర్ రఫీ మున్నీషా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గరిష్ట పరిమితి ఐదేళ్లుండాలి

ఎన్పీకుంట: ఉపాధ్యాయుల బదిలీల్లో గరిష్టంగా ఐదేళ్ల సర్వీసు ఉండేలా మార్గదర్శకాలు రూపొందించాలని వైఎస్సార్‌టీఏ రాష్ట్ర నాయకులు గంగాధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయులకు 'ఐదేళ్ల' తప్పనిసరి బదిలీలు ఉన్నట్లుగానే ఉపాధ్యాయులకూ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ పంపినట్లు వెల్లడించారు.

ఉలవ రైతు కన్నీరు

- చేతికందని ప్రత్యామ్నాయ పంట
- వాతావరణ మార్పులు, వర్షాభావం ఎఫెక్ట్
- ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న రైతులు



విత్తనాలు లేని ఉలవ కాయలు

గాండ్లపెంట: ప్రత్యామ్నాయంగా సాగు చేసిన ఉలవ పంట రైతులకు కన్నీరు మిగిల్చింది. ఖరీఫ్–2024లో వర్షాభావం కారణంగా చాలామంది రైతులు సంప్రదాయ పంట వేరుశనగ సాగు చేయలేకపోయారు. పొలాలు బీడు పెట్టలేక ప్రత్యామ్నాయం కింద ఉలవ సాగు చేస్తే అంతో ఇంతో గిట్టుబాటు అవుతుందని, పశుగ్రాసం లభిస్తుందని భావించారు. కదిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 15,410 ఎకరాల్లో ఉలవ సాగు చేశారు. ఎకరా సాగుకు రూ.10వేల దాకా పెట్టుబడి పెట్టారు. అయితే వాతావరణ మార్పులు, అధిక మంచు, వర్షాభావం పంటపై తీవ్ర ప్రభావం చూపింది. చేతికొచ్చే సమయంలో పంట మొత్తం నల్లగా మారిపోయింది. కాయ ఒలిస్తే అందులో గింజలు కనిపించడం లేదు. పశువులకు గ్రాసానికైనా పనికొస్తుందని పంటను తొలగిస్తున్నారు. పంట తొలగింపునకు ఎకరాకు రూ.10వేలు, నూర్పిడి చేయడానికి గంటకు రూ.1000 చొప్పున వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. తరచూ పంట నష్టాలతో అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గాండ్లపెంట సమీపంలో నల్లగా మారిన ఉలవ పంట



మునగలవారిపల్లి వద్ద ఉలవ పంట తొలగిస్తున్న కూలీలు

కాయల్లో విత్తనాల్లేవ్



నేను ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉలవ సాగు చేశాను. పంట చేతికి వస్తుందని ఆశతో ఉన్నాం. కానీ వాతావరణ ప్రభావంతో నిరాశే మిగిలింది. కాయలు నల్లగా మారిపోవడమే కాదు.. అందులో విత్తనాలు కనిపించడం లేదు. పంట కోసం పెట్టిన రూ.50వేలు నష్టపోయాం. మాలాంటి సన్నకారు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. – ఫజులు, రైతు గాండ్లపెంట

దిగుబడి తక్కువే



ఖరీఫ్‌లో వేరుశనగ పెట్టని రైతులు ప్రత్యామ్నాయం కింద ఉలవ సాగు చేశారు. సాధారణంగా పంట దిగుబడి ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్లు వచ్చేవి. అమితు వాతావరణ మార్పులు చోటుచేసుకోవడం, లోదుక్కులు చేయకపోవడం వల్ల దిగుబడి ఒకటి నుంచి రెండు క్వింటాళ్లకు దిగుబడి పడిపోయింది. – లక్ష్మీప్రియ, ఏఓ, గాండ్లపెంట

వేరుశనగ పొలాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

బత్తలపల్లి: వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పల్లెబాట పట్టారు. వేరుశనగ పంటకు వ్యాపించిన తెగుళ్లను పరిశీలించి, నివారణ చర్యలపై రైతులకు సలహాలు, సూచనలు అందించారు. 'రబీ ఆశలూ గల్లంతే!' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ధర్మవరం వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు కృష్ణయ్య, వ్యవసాయశాఖ అధికారులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది పోట్లమర్రిలో పర్యటించారు. గ్రామంలో వేరుశనగ పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలు కురవడం, ఇప్పుడు చలి ఎక్కువగా ఉండడం, గాలిలో తేమశాతం ఎక్కువగా ఉండడం వలన సెప్టెంబర్ చివరి నుంచి అక్టోబర్ చివరి వరకు సాగు చేసిన వేరుశనగలో నల్లమచ్చ తెగులు ఉధృతి ఎక్కువగా ఉందని గమనించినట్లు వివరించారు. దీని నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి తెలియజేశారు.



తెగులు సోకిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

స్పర్శలేని మచ్చలు ఉంటే డాక్టర్‌ను సంప్రదించండి



చెన్నేకొత్తపల్లిలో వ్యక్తిని పరీక్షిస్తున్న డాక్టర్ రవినాయక్

చెన్నేకొత్తపల్లి: శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉన్నట్లయితే వైద్యుడితో పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న కుష్టు సర్వే కార్యక్రమాన్ని బుధవారం డాక్టర్ తనిఖీ చేశారు. సర్వేను పకడ్బంధీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం డాక్టర్ కొందరిని స్వయంగా పరీక్షించారు.

అవసరం మేరకే మందులు వాడాలి

నల్లచెరువు: పంటలకు అవసరమైన మేరకే మందులు వాడాలని ఏఓ భారతి రైతులకు సూచించారు. రాజమోళ్లపల్లి తండాలో బుధవారం ఏఓ భారతి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ మణికంఠ, వీహెచ్ఏ రాధ, రైతులు పాల్గొన్నారు.

రేషన్‌లో కోతపై ఫిర్యాదు

పుట్టపర్తి: ఫిబ్రవరి కోటాకు సంబంధించి రేషన్ సరుకుల ఇండెంట్‌లో కోత విధించడంపై బుక్కపట్నం మండల పరిధిలోని స్టోర్ డీలర్లు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ నరసింహులుకు ఫిర్యాదు చేశారు. సరుకులు తక్కువ వస్తే కార్డుదారులందరికీ న్యాయం చేయలేమన్నారు. కార్డుదారులకు సరిపడ సరుకులు అందించాలని వినతిపత్రంలో కోరారు.

కుష్టు సర్వేకు సహకరించండి

ధర్మవరం రూరల్: కుష్టు వ్యాధిపై ఎటువంటి అపోహలూ పెట్టుకోవద్దని దర్శనమల పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పలత ప్రజలకు సూచించారు. బుధవారం ఆమె హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఎల్‌సీడీసీ కార్యక్రమంలో భాగంగా గొట్లూరులో జరుగుతున్న కుష్టు వ్యాధి సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఏఎన్ఎంలు నీరజ, అక్కమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి

పుట్టపర్తి అర్బన్: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా సమయానికి వేయించాలని డాక్టర్ మునిచంద్రిక సూచించారు. బుధవారం పుట్టపర్తి మండలం నిడిమామిడి, పెడపల్లి గ్రామాల్లో పర్యటించిన ఆమె గర్భిణీలు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నగేష్, పీహెచ్ఎన్ లలితాకుమారి, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

రెడ్స్ సేవలు రైతులకు ఉపయుక్తం

కదిరి అర్బన్: రెడ్స్ స్వచ్ఛంద సంస్థ సేవలు రైతులకు ఉపయుక్తంగా ఉన్నాయని ఆర్డీఓ వీవీఎస్ శర్మ కొనియాడారు. బుధవారం దిగువపల్లిలో రెడ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. దిగువపల్లిలో హంద్రీ–నీవా కాలువ ఊట నీటి కారణంగా 60 ఎకరాల్లో పంటలు సాగుచేయలేని పరిస్థితి నెలకొంది. రైతుల ఇబ్బందులను గమనించిన రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానూజా రూ.5 లక్షలు వెచ్చించి ఊటనీటికి కాలువ తీయించి చెరువులోకి మళ్లించింది. దీంతో రైతులు పంటలు సాగుచేసుకునేందుకు మార్గం సుగమమైంది. సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ రెడ్స్ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సత్యసాయి వేషధారణలో చిన్నారులు

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తికి చెందిన సాయి విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు.

రహదారి సూత్రాలు తప్పక పాటించాలి

చెన్నేకొత్తపల్లి: వాహనదారులు రహదారి సూత్రాలను తప్పక పాటించాలని రామగిరి సీఐ శ్రీధర్ సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు రహదారి సూత్రాలపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనాలను నడిపే వారు తప్పక హెల్మెట్ ధరించడంతో పాటు వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితిని మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారని ఈ పద్ధతిని మార్చుకోవాలన్నారు. ఎస్ఐ సత్యనారాయణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీధర్

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

ఎన్పీకుంట: సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) లోకేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పి కొత్తపల్లి, పెడబల్లి రైతు సేవ కేంద్రాల పరిధిలో బుధవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు అధికంగా వాడటం వల్ల నాణ్యత లేని పంటలు పండుతాయన్నారు. వేరుశనగ పూత, ఊడగలు దిగే దశలో ఉన్నందున రైతులు తప్పనిసరిగా ఎకరాకు 200 కిలోల జిప్సం చల్లి తవ్వకం జరుపుకోవాలని సూచించారు. కందిలో రసం పీల్చే పురుగు, మారుకా మచ్చల పురుగు, కాయ తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, వీటి నివారణకు లీటరు నీటికి 1.5మి.లీ తయాక్లోప్రిడ్, 0.4 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయెట్, 0.3 మి.లీ స్పైనోసాడ్ కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. వరి సాగు చేసే రైతులు తప్పనిసరిగా నారు కొనలు తుంచి నాటుకోవాలని, ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల కాలిబాటలు వదలాలని తెలిపారు.



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ లోకేశ్వరరెడ్డి

ఏబీసీడబ్ల్యూఓ, వార్డెన్‌పై చర్యలకు డిమాండ్

కదిరి అర్బన్: కదిరి అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బాలాజీ, వార్డెన్ లక్ష్మీనారాయణలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. డివిజన్ పరిధిలోని బీసీ హాస్టళ్లలో మెనూ అమలు కావడం లేదన్నారు. డబ్బు మిగుల్చుకోవడం కోసం వార్డెన్లు నాసిరకం భోజనం పెడుతున్నారని విమర్శించారు. డివిజన్ అధికారి విచారణ పేరుతో ప్రతి వార్డెన్ నుంచి నెలకు రూ.రూ.2వేలు వసూలు చేస్తున్నారని, బిల్లు మంజూరుకు ఐదు శాతం కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ రాఘవేంద్ర, జీవీహెచ్‌పీఎస్ నాయకులు మహేంద్రరాజు, ఎంఎస్ఎఫ్ నరసింహ, ఏఐఎస్‌పీ ఉపేంద్ర, ఎస్ఎస్‌యూ వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆస్పత్రిలో అపరిశుభ్రతపై ఆగ్రహం

ఎన్పీకుంట: మండల కేంద్రం ఎన్పీకుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆవరణమంతా పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉండడంపై డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ, డెలివరీ గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. వ్యాక్సిన్‌లు సకాలంలో వేయాలన్నారు. ఆస్పత్రి ఆవరణంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను రెండు మూడు రోజుల్లోపు తొలగించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో ప్రైవేటు వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలన్నారు. సిబ్బంది తీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ

ధర్మవరం రూరల్: మండలంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో చదువుతున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు బుధవారం ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ నాగేంద్ర, రామకృష్ణల ఆధ్వర్యంలో బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



బిస్కెట్ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

బాధిత కుటుంబానికి పరామర్శ

అమడగూరు: కొక్కంటిపల్లికి చెందిన ఆదినారాయణ (78) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, నక్కలచిన్నప్ప, జయప్ప, నాగరాజు, ఉత్తప్ప, మీసాల నాగరాజు, అన్సార్, లక్ష్మీ, ఇతర ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి మృతి

తనకల్లు: గుంజువారిపల్లికి చెందిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి ఎంబీవీ రమణారెడ్డి (72) అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు నబీ రసూల్, జిల్లా నాయకులు ఆర్ఎస్ రెడ్డి, కృష్ణయ్య, డిపో నాయకులు దివాకర్, శంకర్, ఎస్‌డబ్ల్యూఎఫ్ యాకుబ్‌ఖాన్, టీవీ రెడ్డి, అల్తాఫ్ తదితరులు బుధవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రమణారెడ్డి ఎంప్లాయీస్ యూనియన్‌లో వివిధ స్థాయిలలో పనిచేయడమే కాకుండా రీజనల్ చైర్మెన్ గాను సమర్థవంతంగా ఉద్యమాలను నడిపారని గుర్తు చేసుకున్నారు.

సెస్సు చెల్లిస్తేనే గ్రంథాలయాల మనుగడ

పుట్టపర్తి: సెస్సు చెల్లిస్తేనే గ్రంథాలయాల మనుగడ సాధ్యమవుతుందని ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కటిక జయరామ్ విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థలు ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్మును గ్రంథాలయాలకు చెల్లించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. గ్రంథాలయాలకు సెస్సు రూపంలో కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయన్నారు. అలాగే అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు సక్రమంగా ఇవ్వాలని, ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ధర్మవరం అర్బన్: రక్తదానం అంటే మరొకరికి ప్రాణదానం చేయడమేనని దుర్గమ్మ సేవా సమితి అధ్యక్షుడు అనిల్ తెలిపారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో బుధవారం దుర్గమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సేకరించిన రక్తాన్ని థలసేమియా బాధితులకు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన రోగులకు అందించనున్నామని తెలిపారు. మొత్తం 50 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు బాచి, మోహన్, అశోక్, కార్తీక్, హేమంత్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి ఘన సన్మానం



డీఎస్పీని సన్మానిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ధర్మవరం నుంచి బదిలీ అయిన డీఎస్పీ శ్రీనివాసులుకు బుధవారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్‌హాలులో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఎస్పీ రత్న హాజరై డీఎస్పీ శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. బదిలీలు సర్వసాధారణమని, ఎక్కడికి వెళ్లినా బాధ్యతగా పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ధర్మవరం నూతన డీఎస్పీ హేమంత్ కుమార్, ఆర్ఐలు మహేష్, వలి, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కుల అందజేత



చెక్కు అందిస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం: మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న శంకరయ్య, నారాయణరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఎక్స్‌గ్రేషియా చెక్కులను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సీఐటీయూ నాయకులు జె.వి.రమణ, అయూబ్‌ఖాన్‌ల సమక్షంలో అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ వీరేష్, అసిస్టెంట్ ఇంజినీర్ కళావతి, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఓబుళపతి, లింగరాజు, బొగ్గు నాగరాజు, అనిల్, దస్తగిరి, బాబు, వరదరాజులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కదిరి అర్బన్: పట్టణంలోని వాల్మీకీ, జైన్, చైతన్య పాఠశాలల్లో బుధవారం సీఐ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. పాఠశాల వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల యాజమాన్యం, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

తనకల్లు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో బుధవారం రహదారి భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఎస్ఐ గోపి, ఎంవీఐ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.